పెచ్చులూడిన పాఠశాల పైకప్పు

- త్రుటిలో తప్పిన ప్రమాదం

రాయపోల్, సెప్టెంబరు 5: పాఠశాల వరండాలోని పైకప్పు పెచ్చులూడిన ఘటన రాయపోల్ మండలం వీరానగర్ పాఠశాలలో గురువారం చోటుచేసుకుంది. విద్యార్థులకు త్రుటిలో ప్రమాదం తప్పింది. వీరానగర్ పాఠశాలను 15 ఏళ్ల క్రితం నిర్మించారు. కనీసం 30 ఏళ్ల పాటు మన్నికగా ఉండాల్సిన భవనం 15 ఏళ్లకే దెబ్బతిన్నది. వర్షం పడితే చాలు భవనంపై కప్పు ఉరుస్తున్నది. ఈ క్రమంలో గురువారం ఉదయం పాఠశాల తెరచిన తర్వాత పిల్లలందరూ గదుల్లోకి వెళ్లాక వరండాలోని పైకప్పు పెచ్చులూడి పడింది. ఆ సమయంలో విద్యార్థులు ఎవరూ వరండాలో లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ పాఠశాల పక్కనే ఉన్న మరో భవనంలో అంగన్‌వాడీ కేంద్రం నడుస్తున్నది. ఆ సమయంలో చిన్నపిల్లలు అటువైపు వెళ్తే పెద్ద ప్రమాదమే జరిగేదని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనుల్లో భాగంగా భవనం పైకప్పుకు మరమ్మతులు చేయాల్సిందిగా ఎంఈవో నర్సవ్వ పేర్కొన్నారు.



పెచ్చులూడిన రాయపోల్ మండలం వీరానగర్ పాఠశాల పైకప్పు



పాఠశాల వరండాలో పడ్డ పైకప్పు పెచ్చులు

'మహబూబ్‌సాగర్' సందర్శించిన జగ్గారెడ్డి

చెరువు మోకాళ్ల నీళ్ల లోతుల్లోకి దిగి అలుగు పరిశీలన గుర్రపు డెక్కను పూర్తిగా తొలగించేలా సూచనలు



సంగారెడ్డిలోని మహబూబ్‌సాగర్ చెరువులో పేరుకున్న గుర్రపు డెక్కను తొలగిస్తున్న యంత్రం పైకెక్కి పరిశీలిస్తున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



మహబూబ్‌సాగర్ చెరువు అలుగు వద్ద నీటిలోకి దిగి పరిశీలిస్తున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి

సంగారెడ్డి, సెప్టెంబరు 5: సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని మహబూబ్‌సాగర్ చెరువును గురువారం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి సందర్శించారు. మోకాళ్ల లోతు నీటిలోకి దిగి కలియదిరిగారు. పారుతున్న అలుగును పరిశీలించారు. చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్కను తొలగిస్తున్న యంత్రం పైకెక్కి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ మహబూబ్‌సాగర్ చెరువు అలుగు పారడం హర్షణీయమన్నారు. చెరువును పరిశుభ్రంగా ఉంచడానికి ఐదు నెలల నుంచి ప్రత్యేక యంత్రంతో గుర్రపుడెక్కను తొలగిస్తున్నట్లు చెప్పారు. కొద్దిరోజుల్లోనే పూర్తిస్థాయిలో గుర్రపు డెక్కను తొలగించి చేపల పెంపకానికి అనుకూలంగా మారుస్తామని అన్నారు. చెరువు పరిసరాల్లో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తామని, పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు.


కరువు నేలపై జల సవ్వడి

కప్పతల్లి ఆటలు.. దేవతలకు జలాభిషేకాలు.. వరదపాశాలు.. మబ్బుల కేసి ఎదురు చూపులు..ఇది వానాకాలం వచ్చిందంటే వరుణుడి కరుణ కోసం మెట్ట ప్రాంత రైతుల పరిస్థితి. సాగుకు దూరం కాక కరువుతో కొట్లాడుతూ ఏటా ఆటుపోట్లు ఎదుర్కొనే రైతన్నలపై వరుణుడు కరుణించాడు. కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాలు.. కరువు నేలపై జలసవ్వళ్లు చేస్తున్నాయి. ఈసారి కరువు తీరా వర్షాలు పడ్డాయి...

- హుస్నాబాద్, సెప్టెంబరు 5

మత్తడి దుంకుతున్న హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు





మత్తడి దుంకుతున్న మహాసముద్రం రిజర్వాయర్

- నిండుకుండలా చెరువులు, కుంటలు..
- మత్తడి దుంకుతున్న శనిగరం ప్రాజెక్టు..
- హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువుకు జలకళ
- నిత్యం మబ్బులకేసి చూసే మెట్ట ప్రాంత రైతుల్లో ఆనందం

హుస్నాబాద్ డివిజన్‌లోని హుస్నాబాద్, కోహెడ, మద్దూరు, అక్కన్నపేట, బెజ్జంకి మండలాల్లో ఈ వర్షాలు ఆలస్యంగానైనా సమృద్ధిగా కురువడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. డివిజన్‌లో మధ్యతరహా అయిన శనిగరం ప్రాజెక్టు నిండుకుండలా మారి మత్తడి దూకుతుంది. సింగరాయ ప్రాజెక్టులోకి సమృద్ధిగా నీరు చేరి మత్తడి దుంకుతుంది. పట్టణ ప్రజల దాహార్తితో పాటు సాగునీటికి ఉపయోగపడే హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు మూడు రోజులుగా ఉధృతంగా మత్తడి పోస్తుంది.

వర్షాకాలం ప్రారంభమైనా వానలు కురవక మెట్ట రైతులు దిగాలు చెందారు. వరుణుడు కరుణిస్తాడో లేదోననే ఆందోళనతో గతం కంటే ఎక్కువ మంది రైతులు వరి పంటకు దూరంగా ఉండి పత్తివైపు మొగ్గు చూపారు. అందుకే గత ఖరీఫ్ కంటే కొంత సాగు విస్తీర్ణం తగ్గింది. ఆలస్యంగానైనా సమృద్ధిగా వర్షాలు పడి డివిజన్‌లో ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు నిండు కుండలా మారాయి. అయితే, ఈ వర్షాలు రైతులకు కొంత నష్టాలు కూడా కలిగించాయి. ఖరీఫ్‌లో సాగు తగ్గినా యాసంగి పంటకు ఇక ఢోకా ఉండదని రైతాంగం హర్షం వ్యక్తం చేస్తుంది. డివిజన్‌లో 1,60,612 ఎకరాలు సాగుకు యోగ్యమైన భూమి ఉండగా దాదాపు లక్ష ఎకరాల వరకు సాగు చేశారు. హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట, బెజ్జంకి మండలాల్లో 69,125 ఎకరాల్లో వరి, 2841 ఎకరాల్లో మొక్కజొన్న, 22,142 ఎకరాల్లో పత్తి, 3306 ఎకరాల్లో ఇతర పంటలు వేశారు. గత ఖరీఫ్‌లో 1. 20 లక్షల ఎకరాల్లో సాగు చేశారు.

మూడు రోజులుగా డివిజన్‌లో భారీగా వర్షాలు కురిసి లోటు నుంచి అధిక వర్షపాతం నమోదైంది. ఈ వర్షాలతో బెజ్జంకి మండలంలోని తోటపల్లి ఆన్‌లైన్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లోకి వరద నీరు చేరి మత్తడి పడుతుంది. మోయతుమ్మెద వాగు పారుతుంది. గుండారం, చీలాపూర్, గాగిల్లాపూర్, మోతుకుల కుంట, తుమ్మల కుంట, నరసింహులపల్లి చెరువులు నిండుకుండలా మారాయి. అక్కన్నపేట మండలంలో అక్కన్నపేట, చౌటపల్లి, గోవర్దనగిరి, రేగొండ, మద్దూర్ మండలంలోని కూటిగల్ నల్ల చెరువు, అర్జున్‌పట్ల వెలగరాయుని చెరువు, గాగిల్లాపూర్ పెద్ద చెరువు, లద్నూర్ ఎల్లమ్మ చెరువుతో పాటు మిగతా చెరువులూ నిండాయి. కోహెడ మండలంలో చెక్‌డ్యాంలు, ఎల్లమ్మ వాగు, మోయతుమ్మెద వాగులు ప్రవహిస్తున్నాయి. హుస్నాబాద్ మండలంలోని మహాసముద్రం గండి రిజర్వాయర్‌తో పా టు దాదాపు అన్ని చెరువులు నిండి మత్తడి పడుతున్నాయి.

పుష్కలంగా నీరు..

డివిజన్‌లో ఏకైక మధ్యాతరహా శనిగరం ప్రాజెక్టు నిండుకుండలా మారింది. ప్రాజెక్టు సామర్థ్యం 27ఫీట్లు కాగా మూడు రోజుల నుంచి మత్తడి పడుతుంది. ప్రాజెక్టు కింద 5,100 ఎకరాల ఆయకట్టు ఉండగా ఈసారి ఆలస్యంగా సాగుచేశారు. ప్రస్తుతం ప్రాజెక్టు నిండటంతో వేసిన పంటలకు సాగునీటి సమస్య ఉండదని రైతులు పేర్కొంటున్నారు. హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు ఉధృతంగా మత్తడి దుంకుతుంది. 1800ఎకరాల ఆయకట్టు ఉండే హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు కింద వరినాట్లు పూర్తి చేశారు. మెట్ట ప్రాంతంపై వరుణుడు కరుణించడంతో రైతుల మోముల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.



నిండుకుండలా మహాసముద్రం రిజర్వాయర్



మత్తడి దుంకుతున్న కోహెడ మండలం శనిగరం ప్రాజెక్టు

కోహెడలో కన్నీటి సంద్రం!

- వర్షబీభత్సానికి కూలిన ఇళ్లు.. ● వందల ఎకరాల్లో దెబ్బతిన్న పంటపొలాలు
- ధ్వంసమైన రహదారులు ● రాకపోకలకు తీవ్ర అంతరాయం
- కొనసాగుతున్న పునరావాస కేంద్రాలు ● గ్రామాల్లో పర్యటిస్తున్న అధికారులు

కోహెడ, సెప్టెంబరు 5: వర్ష, వరద బీభత్సం కోహెడ మండల ప్రజలకు తీరని దు:ఖాన్ని మిగిల్చింది.. రైతులకు అపార నష్టాన్ని కలిగించింది. మండలంలో వందల ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. వరద ఉధృతికి పలు గ్రామాల్లోని ప్రధాన రహదారులు లోలెవల్ వంతెనలు మునగడంతో రాకపోకలు గురువారం కూడా నిలిచిపోయాయి. కోహెడ, కరీంనగర్ ప్రధార రహదారి పై ఉన్న రేణుకా ఎల్లమ్మ వాగు వరద ఉధృతిలో లోలెవల్ వంతెన కొట్టుకుపోయింది. సిద్దిపేట, కరీంనగర్‌కు రాకపోకలు నిలిచాయి. కొన్ని గ్రామాల్లో వాగు పరివాహక ప్రాంతాల్లో ఉన్న వ్యవసాయ మోటార్లు కొట్టుకుపోగా మరి కొన్ని నీటిలో మునిగిపోయాయి. మోయ తుమ్మెద వాగు, పిల్లి వాగు, రేణుకా ఎల్లమ్మ వాగులు ఉధృతంగా ప్రవహించడంతో పాటు వరద నీరు చేరి పొలాల్లోకి చేరింది. భారీ వర్షాల వల్ల పత్తి, మొక్కజొన్న, వరి పంటలకు నష్టం వాటిల్లింది. మండలంలోని పలు గ్రామాల్లో 1191 రైతులకు చెందిన 1226 ఎకరాల్లో వరి, పత్తి, మొక్కజొన్నపంటలకు నష్టం వాటిల్లినట్లు అంచనా వేసి నివేదికను పైఅధికారులకు పంపామని మండల వ్యవసాయ అధికారి సతీష్ తెలిపారు. చేతికొచ్చిన పంటలు నీట మునగడంతో అన్నదాతలు కన్నీటి సంద్రంలో మునిగారు. తంగళ్లపల్లి, బస్వాపూర్ గ్రామాల్లో పునరావాస కేంద్రాలు కొనసాగుతున్నాయి. అధికారులు ఆయా గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. నష్టపోయిన పంటపొలాలకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు, దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



కోహెడ-కరీంనగర్ ప్రధాన రూట్‌లో ఇందుర్తి వద్ద కొట్టుకుపోయిన రోడ్డు



సముద్రాల గ్రామంలో పొలంలో ఇసుకమేట

కూలిన ఇళ్లు..

వాన తగ్గినా వదలని వరదలతో రవాణా వ్యవస్థ అస్తవస్తంగా మారింది. జనజీవనం స్తంభించింది. 30 ఇళ్లలో కొన్ని పాక్షికంగా, మరికొన్ని పూర్తిగా కూలిపోయాయి. వరద వల్ల ఇళ్లలోని నిత్యావసర సరుకులు, వస్త్రాలు తడిసి ముద్దయ్యాయి.

చెత్తను తొలగించిన గ్రామస్థులు

కోహెడ మండలం తంగళ్లపల్లి శనిగరం రహదారిపై ఉన్న పిల్లివాగు బ్రిడ్జి వద్ద నీటి ప్రవాహం ఉండటం వల్ల మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు గడ్డి, చెత్త చెదారం, ఇతరత్రా వాటిని గ్రామస్థులు గురువారం తొలగించారు. ప్రయాణికులు ఇబ్బందుల దృష్ట్యా మాజీ సర్పంచ్ పాము నాగేశ్వరి శ్రీకాంత్ చొరవ తీసుకుని జేసీబీ గ్రామ యువకుల సహాయంతో వాగు వద్ద చెత్తను తొలగించి రాకపోకలు ప్రారంభించారు.



తంగళ్లపల్లి వద్ద పిల్లివాగుపై నిలిచిన గడ్డి, చెత్తను తొలగిస్తున్న గ్రామస్థులు



కేశవరావు నుంచి అవార్డు అందుకుంటున్న మధుసూదన్

మధుసూదన్‌కు రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డు

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబర్ 5 : సిద్దిపేట డిగ్రీ కళాశాల భౌతికశాస్త్ర విభాగాధిపతి సీహెచ్ మధుసూధన్ రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డును అందుకున్నారు. సెప్టెంబరు 5 ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని గురువారం హైదరాబాద్‌లో తెలంగాణ విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు చేతులమీదుగా మధుసూదన్ అవార్డు తీసుకున్నారు. 2001లో స్కూలు అసిస్టెంట్‌గా మొదలైన మధుసూదన్ ఉద్యోగ ప్రస్థానం, 2008లో జూనియర్ లెక్చరర్‌గా, 2011 నుంచి డిగ్రీ కళాశాల అధ్యాపకునిగా విధులు నిర్వర్తించారు. 2020లో సిద్దిపేటకు బదిలీపై వచ్చారు. ప్రస్తుతం డిగ్రీ కాలేజ్ భౌతికశాస్త్ర విభాగాధిపతిగా, అంబేడ్కర్ యూనివర్సిటీ రీజనల్ సెంటర్ కో-ఆర్డినేటర్‌గా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్‌గా, ఉన్నత భారత అభియాన్ కో-ఆర్డినేటర్‌గా, అకడమిక్ కోఆర్డినేటర్‌గా పలు హోదాల్లో విశిష్ట సేవలు అందిస్తున్నారు. నైపుణ్య విద్యకు సంబంధించి ఎల్ఈడీ బల్బుల తయారీ, రోబోటిక్స్‌లో 3 వేల మంది విద్యార్థులకు శిక్షణనిస్తూ రాష్ట్ర స్థాయిలో గుర్తింపుపొందారు. బోధన, పరిశోధన, పాఠ్యపుస్తకాల రచన, సామాజిక సేవ, ఉన్నత విద్యారంగంలో రిసోర్స్ పర్సన్‌గా మధుసూదన్ తనదైన ముద్రవేశారు.



ఉపాధ్యాయురాలికి పువ్వు ఇచ్చి కృతజ్ఞతలు తెలుపుతున్న కండక్టర్

ఆర్టీసీ బస్సుల్లో ఉపాధ్యాయులకు సన్మానం

హుస్నాబాద్, సెప్టెంబరు 5 : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం హుస్నాబాద్‌లో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేసే ఉపాధ్యాయులను ఆర్టీసీ కండక్టర్లు పూలు, శాలువాలతో సన్మానించారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

మీరే దాడులు చేసి మాపై కేసులు పెడతారా

- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేటటౌన్, సెప్టెంబరు5: "మేము వరద సహాయం చేయడానికి ఖమ్మం వెళ్తే, అధికారం ఉందనే అహంతో మాపై దాడులు చేసి, మాపైనే కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసమని" మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. గురువారం సిద్దిపేటలోని విపంచి కళానిలయంలో 500 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో రూ.50 వేలతో కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ ప్రారంభమైందని చెప్పారు. దానిని తిరిగి రూ.లక్ష పెంచిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తులం బంగారం ఇస్తామన్నది నేటికీ ఇవ్వడం లేదని, త్వరగా తులం బంగారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో అందిస్తున్న కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్లు కాంగ్రెస్ ప్రభుత్వంలో మాయమైపోతున్నాయని ఆయన తెలిపారు. తన తుది శ్వాస వరకు ప్రజాసేవలో ఉంటానని చెప్పారు. కాంగ్రెస్‌ది ప్రజాపాలనైతే ఒకసారి రివ్యూ చేసి తెలుసుకోవాలని, పిచ్చిప్రేలాపనలు మానుకుని కేసులు ఉపసంహరించుకోవాలని సూచించారు. కేసీఆర్ సూచన మేరకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు నెల వేతనాన్ని వరద బాధితులకు అందిస్తున్నట్లు చెప్పారు. సహాయం చేస్తున్న మమ్మల్ని అడ్డుకుంటున్నందుకు కాంగ్రెస్ ప్రభుత్వంపై అక్కడి ప్రజలు, మహిళలు దుమ్మెత్తిపోస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాజనర్సు పాల సాయిరాం, బర్ల మల్లికార్జున్, ఇర్షాద్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షోభంలో సంక్షేమ హాస్టళ్లు

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన వసతి గృహాల సలహా సంఘం సమావేశంలో హరీశ్‌రావు పాల్గొని మాట్లాడారు. వసతి గృహ విద్యార్థులను మన కన్నపిల్లలుగా చూసుకోవాలన్నారు. హాస్టల్స్‌లో నెలకొన్న సమస్యలపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేవిధంగా కృషి చేస్తానని చెప్పారు. దాదాపు 6 నెలల నుండి డైట్ కాస్మోటిక్ చార్జీలు రాకపోవడంపై ప్రభుత్వంపై మండిపడ్డారు. హాస్టళ్లలో పనిచేసే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు 7 నెలలుగా జీతాలు పెండింగ్ ఉన్నాయని తక్షణమే చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. మౌలిక సదుపాయాలపై ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపాలని సూచించారు. నియోజకవర్గంలో అన్ని హాస్టళ్లలో విద్యాధికారులు, తహసీల్దార్‌లు ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. సమావేశంలో జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, మండల విద్యాధికారులు, తహసీల్దార్‌లు, సంక్షేమ శాఖ అధికారులు, వార్డెన్‌లు తదితరులు పాల్గొన్నారు.



విపంచి కళానిలయం వద్ద పోలీసులు



విపంచి కళానిలయంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

ఉపాధ్యాయులకు ప్రత్యేక స్థానం

సమాజంలో ఉపాధ్యాయులకు ఒక ప్రత్యేకమైన స్థానం ఉందని హరీశ్ రావు అన్నారు. గురువారం సిద్దిపేటలోని టీచర్స్ భవనంలో గురు పూజోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. జిల్లా ఉపాధ్యాయులు ఎప్పుడూ సిద్దిపేట గౌరవాన్ని కాపాడారని చెప్పారు. రాష్ట్రంలో పదవ తరగతి ఫలితాల్లో సిద్దిపేటను రెండవ స్థానంలో, రాష్ట్రంలోనే సిద్దిపేట జిల్లాను ట్రిబుల్‌ఐటీలో మొదటి స్థానంలో నిలిపారని ఆయన అభినందించారు.

స్వల్ప ఉద్రిక్తత

సిద్దిపేటలో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య ఇటీవల నెలకొన్న ఫ్లెక్సీ వివాదం కారణంగా పోటాపోటీ నిరసనలు, ఉద్రిక్తతలు నెలకొన్న పరిస్థితి తెలిసిందే. గురువారం సిద్దిపేటలోని విపంచి కళానిలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీలో భాగంగా హరీశ్‌రావు అందిస్తుండటంతో మరోసారి ఎలాంటి ఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తుగా భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. విపంచిలోకి లబ్ధిదారులతో పాటు ప్రజా ప్రతినిధులను మాత్రమే అనుమతించారు. నాయకులు ఎవరూ కూడా వెళ్లకుండా అడ్డుకోవడంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం లబ్ధిదారులకు చెక్కులతో పాటు తులం బంగారమివ్వాలని బీఆర్ఎస్ నాయకులు నినాదాలు చేశారు.

మార్కెటింగ్‌కు అవసరమైన పంటలను సాగుచేయాలి

- కలెక్టర్ మనుచౌదరి

అక్కన్నపేట/సిద్దిపేటరూరల్, సెప్టెంబరు 5: రైతులు మార్కెటింగ్‌కు అవసరమైన పంటలు పండించి లాభాలు పొందేందుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ మనుచౌదరి సూచించారు. గురువారం అక్కన్నపేట మండల కేంద్రంలోని రైతువేదికలో నాబార్డు ఆధ్వర్యంలో నడుస్తున్న పలు స్వచ్ఛంద సంస్థలు రైతులకు కల్పిస్తున్న సబ్సిడీలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మార్పులు అనేవి సులభంగా రావని, బిజినెస్ మార్గంలో ఆలోచించి, డిమాండ్ ఉన్న వాటిని పండించి లాభాలు గడించాలని సూచించారు. జిల్లాలో ఉన్న రెండు స్వచ్ఛంద సంస్థలు చేపట్టిన ఎస్‌పీవోలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈ సదస్సులో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాధిక, ఉద్యానవన శాఖ అధికారి సువర్ణ, ఆర్డీవో రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌పీవోలను సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

ఎఫ్‌పీవోలకు సంబంధించిన సమస్యలను వాట్సాప్ గ్రూపులో పెట్టిన వెంటనే స్పందించి వాటిని పరిష్కరించాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. గురువారం బుస్సాపూర్‌లో గల ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ సభ్యుడు వెంకటేష్ ఎకరన్నరలో సాగుచేసిన టమాట, మిరప పంట సాగును కృషి కల్ప ఫౌండేషన్ సీఈవో సీఎం.పాటిల్‌తో కలిసి ఆయన పరిశీలించారు. పంటలు వాటి ఇన్‌పుట్, అవుట్ పుట్ చేసే విధానం గురించి ఫౌండేషన్ సీఈవో భాస్కర్ అధికారులకు వివరించారు. బయటి రాష్ట్రాల నుంచి వచ్చే టామాటాను కాకుండా ఇక్కడి టమాటాను కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు ఎల్లప్పుడు అందుబాటులో ఉండేలా చూడాలని రైతులు కోరగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి రాధిక, జిల్లా ఉద్యానవ శాఖ అధికారి సువర్ణ, నాబార్డు డీడీయం నిఖిల్, మండల వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు, ఎఫ్‌పీవో డైరెక్టర్లు పాల్గొన్నారు.



అక్కన్నపేట మండలం రైతు అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

మల్లన్న సన్నిధిలో అదనపు కలెక్టర్ ప్రత్యేక పూజలు

చేర్యాల, సెప్టెంబరు 5 : కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయాన్ని సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్ గురువారం కుటుంబసభ్యులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మల్లన్నను దర్శించుకుని అభిషేకం నిర్వహించి మొక్కులను తీర్చుకున్నారు. ఆలయాధికారులు సంప్రదాయం ప్రకారం స్వాగతం పలకగా, అర్చకులు స్వామివారి ప్రసాదం అందించి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కుమారస్వామి, ఎస్‌ఐ రాజుగౌడ్, ఆలయ ఏఈవో బుద్ధి శ్రీనివాస్, సూపరింటెండెంట్ సురేందర్‌రెడ్డి, ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్, ఆకుల విజయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి హరిప్రసాద్ పాల్గొన్నారు.




మల్లన్న ఆలయంలో అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్, మల్లన్నను దర్శించుకుని వెళుతున్న మహిళా అఘోరా

మల్లన్నను దర్శించుకున్న మహిళా అఘోరా

కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయాన్ని మహిళా అఘోరా గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మల్లన్నను దర్శించుకుని పూజలు చేశారు. అర్చకులు స్వామివారి ప్రసాదం అందించారు. తాను శైవక్షేత్రాలు పర్యటిస్తున్న క్రమంలో కొమురవెల్లి మల్లన్న ఆలయానికి వచ్చినట్లు అఘోరా తెలిపారు. వంటినిండా విభూతి, చేతిలో త్రిశూలం ధరించిన మహిళా అఘోరా ఆలయంలో సందడి చేయడంతో భక్తులు ఆశ్చర్యానికి లోనయ్యారు.

కుంటలో ఇళ్లు.. కొన్నవాళ్లకు కడగండ్లు!

- ఇస్నాపూర్‌లో కుంటను పూడ్చి గృహాల నిర్మాణం
- రూ. 20 కోట్ల ప్రభుత్వ భూమికి ఎసరు
- భారీ వర్షాలకు నీట మునిగిన ఇళ్లు
- 'హైడ్రా' దూకుడుతో గుబులు

పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 5 : రియల్టర్ల లీలలకు సామాన్యులు బలవుతున్నారు. చెరువులు కుంటల్లో వెంచర్లు వేసి, అడ్డదారిలో అనుమతులు పొంది ఇళ్లను నిర్మించి అమాయకులకు అంటగట్టారు. హైడ్రా దూకుడుతో కొన్నవారు బెంబేలెత్తుతున్నారు. ఇస్నాపూర్ గ్రామంలో 372 సర్వే నంబరులో 1.5 ఎకరాల విస్తరణంలో 'లీలకుంట' ఉండేది. కుంట ఇస్నాపూర్ పరిధిలో ఉండగా, కుంట నీరు ముత్తంగి గ్రామ పరిధిలోని వ్యవసాయ పొలాలకు పారేది. ఈ కుంటకు ఆనుకుని వెంచర్ నిర్మాణం చేపట్టిన ఓ రియల్ సంస్థ కుంటపై కన్నేసింది. అధికారయంత్రాంగం సహకారంతో కుంటను కబ్జా చేసింది. హెచ్ఎండీఏ అనుమతులు, పంచాయతీ పాలకవర్గం ఎన్‌వోసి సాధించి నిర్మాణాలు చేపట్టింది. కుంట కబ్జాపై గ్రామస్థులు ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రహరీని కూల్చేసి చేతులు దులుపుకున్నారు. అయినా సదరు సంస్థ ఇళ్ల నిర్మాణాన్ని పూర్తిచేసి విక్రయించింది. ఇదే వెంచర్‌కు ఆనుకుని ఉన్న ఎర్రకుంట ఎఫ్‌టీఎల్ పరిధిని రియల్ సంస్థ కబ్జా చేసిందని ఆరోపణలున్నాయి.



లీలకుంట ప్రాంతంలో నీటమునిగిన గృహ సముదాయాలు

కఠిన చర్యలు తీసుకోవాలి



లీలకుంటను కబ్జా చేసి గృహ సముదాయాలు నిర్మించిన రియల్ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలి. కబ్జాకు సహకరించిన అధికారులపైనా చర్యలు తీసుకోవాలి.

-యాదగిరి, మాజీ వార్డు సభ్యుడు, ఇస్నాపూర్

నీట మునిగిన ఇళ్లు

తాజాగా కురిసిన భారీ వర్షాలకు లీల కుంట పరిధిలో నిర్మించిన గృహసముదాయం లోకి నీళ్లు వచ్చాయి. అన్ని అనుమతులు ఉన్నాయని ఇళ్లు కొంటే.. కుంటలోనే ఇళ్లు నిర్మించారన్న విషయం బయటపడింది. ఇది తెలుసుకున్న ఇళ్ల యజమానులు హైడ్రా దూకుడుతో భయాందోళనకు గురవుతున్నారు. కుంటలో ఉన్న నిర్మాణాలను కూల్చేసి కుంటను పునరుద్ధరించాలని గ్రామస్థులు కోరుతున్నారు. హెచ్ఎండీఏ అనుమతులు చూసే తాము ఈ నిర్మాణాలను కొన్నామని, ఇళ్లను కూల్చేసినా రియల్ సంస్థ యాజమాన్యం నుంచి వేరే చోట గృహాలు కానీ, డబ్బు కానీ ఇప్పించాలని యజమానులు కోరుతున్నారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

- ఎమ్మెల్సీ కోదండరామ్‌కు ఎస్టీయూ వినతి



కోదండరామ్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న మహిపాల్‌రెడ్డి, వెంకటేశం

వెల్దుర్తి, సెప్టెంబరు 5 : 12 నుంచి 14 సంవత్సరాలుగా ఒకే పాఠశాలలో పని చేస్తూ ఇటీవల జరిగిన ఎస్జీటీ ఉపాధ్యాయులు బదిలీ అయినప్పటికీ వారిని పాత పాఠశాలల్లోనే కొనసాగిస్తున్నారని, వెంటనే రిలీవ్ చేయాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికెల వెంకటేశం అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డితో కలిసి వెంకటేశం ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరామ్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. వర్క్ అడ్జెస్ట్‌మెంట్ పేరుతో ప్రాథమిక పాఠశాలలను బలహీన పరుస్తున్నారన్నారు. ప్రైమరీ పాఠశాలల్లో బోధనేతర పనులు, ఆన్‌లైన్, అడ్మినిస్ట్రేషన్ కోసం ప్రైమరీ స్కూల్ హెడ్‌మాస్టర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. 5,571 అదనపు ప్రైమరీ స్కూల్ హెడ్‌మాస్టర్ పోస్టులను మంజూరు చేసి సెకండరీ గ్రేడ్ టీచర్లకు డీఎడ్, బీఎడ్ కామన్ సీనియారిటీతో పదోన్నతులు కల్పించాలని, విద్యా వ్యవస్థలో అత్యధిక సంఖ్యలో ఉన్న ప్రాథమిక పాఠశాలలకు సెంకడరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు ప్రాధాన్యం కల్పించాలని, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్సీని కోరారు.

రాయికుంట చెరువును ఆక్రమించిన మాజీ సర్పంచ్‌పై
కఠిన చర్యలు తీసుకోవాలి

- బాధిత రైతులు

బర్కత్‌పుర, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం వెలిమెల గ్రామంలోని సర్వే నంబర్ 421లో ఉన్న రాయికుంట చెరువును మాజీ సర్పంచ్ మహిపాల్‌గౌడ్ కబ్జాచేశారని బాధిత రైతులు ఆరోపించారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైతులు ఖానాపురం ఎల్లారెడ్డి, శేఖర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, నారాయణరెడ్డి మాట్లాడుతూ.. రాయికుంట చెరువులోని 20ఎకరాల 30గుంటల స్థలాన్ని మహిపాల్‌గౌడ్ ఆక్రమించి తూమును తొలగించారని ఆరోపించారు. అలాగే సర్వేనంబర్ 15లో మరో 20ఎకరాల ప్రభుత్వభూమిని ఆక్రమించి అక్రమ కట్టడాలు కట్టారన్నారు. మహిపాల్‌గౌడ్ కబ్జాపై హైడ్రాకు ఫిర్యాదు చేశామని వారు చెప్పారు. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని చెరువును పూర్తిస్థాయిలో పునరుద్ధరించి రైతులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

జిన్నారంలో కేంద్ర వైద్య బృందం పర్యటన



వివరాలు సేకరిస్తున్న వైద్య బృందం

జిన్నారం, సెప్టెంబరు 5: మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర వైద్యుల బృందం గురువారం జిన్నారంలో పర్యటించారు. జిన్నారం పంచాయతీ పెద్దమ్మగూడెంలో యూనియన్ సెక్రటరీ గవర్నమెంటు ఆఫ్ ఇండియా మలయ్‌కుమార్, డాక్టర్ అమర్‌సింగ్, రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, డీఎంవో డాక్టర్ ప్రవీణ్, స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ కోమల్ తారక్ పర్యటించారు. ఈ సందర్భంగా పలు నివాసాలకు వెళ్లి మాస్ డ్రగ్ కార్యక్రమంలో ట్యాబ్లెట్ల పంపిణీపై వివరాలు సేకరించారు. సీజనల్ వ్యాధులు, ఇతర ఆరోగ్య సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం నల్తూరు ప్రభుత్వ పాఠశాల, హెటిరో డ్రగ్స్ పరిశ్రమను వారు సందర్శించారు.

చిరాగ్‌పల్లిలో కొండెంగకు అంత్యక్రియలు




కొండెంగకు అంతిమసంస్కారాలు నిర్వహిస్తున్న గ్రామస్థులు

జహీరాబాద్, సెప్టెంబరు 5 : మండలంలోని చిరాగ్‌పల్లి గ్రామంలో గురువారం ఉదయం కొండెంగ రోడ్డును దాటుతున్న క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో చనిపోయింది. ఈ విషయాన్ని గమనించిన గ్రామస్థులు మృతిచెందిన కొండెంగకు హిందూ సంప్రదాయం ప్రకారం అంతిమ సంస్కారాలను నిర్వహించారు. రోడ్డుపైనే కొండెంగకు స్నానం చేయించి, అంతిమ సమయంలో చేపట్టాల్సిన కార్యక్రమాలను చేపట్టి, టపాసుల పేలుస్తు పాడేపై మోసుకెళ్లి ఖననం చేశారు.

కేతకీ హుండీ ఆదాయం రూ.43.22 లక్షలు

ఝరాసంగం, సెప్టెంబరు 5 : దక్షిణకాశీగా ప్రసిద్ధిగాంచిన కేతకీ సంగమేశ్వర స్వామి హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. ఈ హుండీ లెక్కింపు ఉదయం నుంచి రాత్రి వరకు కొనసాగింది. 59 రోజుల్లో హుండీ ఆదాయం రూ.43.22 లక్షలు వచ్చినట్లు ఆలయ ఈవో శశిధర్ గుప్తా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా దేవాదాయ సహాయ కార్యదర్శి చంద్రశేఖర్, అధికారులు రంగరావు, సిబ్బంది, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వృద్ధురాలిని
బంధువులకు అప్పగించిన పోలీసులు

చిలప్‌చెడ్, సెప్టెంబరు 5: ప్రధాన రోడ్డు పక్కన ఒంటరిగా మతిస్థిమితం లేని స్థితిలో ఉన్న వృద్ధురాలిని గమనించిన పోలీసులు ఆమెను చేరదీసి తమ సంబంధీకులకు అప్పగించిన సంఘటన మండల పరిధిలో గురువారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చాముండేశ్వరి ఆలయం సమీపంలో 70 సంవత్సరాల వృద్ధురాలు మతిస్థిమితం లేని స్థితిలో ఒంటరిగా ఉండడాన్ని గమనించిన పోలీసులు ఆమెను తీసుకొచ్చి.. నెమ్మదిగా వివరాలు అడగగా తన పేరు పట్లోళ్ల నర్సమ్మ, గ్రామం బచ్చుగూడ, పటాన్‌చెరు మండలం అని తెలిపింది. ఈ సమాచారం మేరకు పటాన్‌చెరు పోలీసులకు సమాచారాన్ని చేరవేశారు. విచారణ చేసిన అక్కడి పోలీసులు వృద్ధురాలి బంధువులకు విషయం తెలిపారు. వారు చిలప్‌చెడ్ పోలీసులను సంప్రదించడంతో వారికి ఆమెను అప్పగించినట్లు తెలిపారు. కానీ ఆమె ఇక్కడికి ఎలావచ్చిందోనన్న విషయం తెలియలేదని పోలీసులు తెలిపారు.



కోహీర్ నారింజ వాగు పరీవాహక ప్రాంతంలోని మినుముల పంట పొలంలో చేరిన వరద నీరు

నాలుగైదు రోజులుగా కురిసిన వర్షాలు రైతులకు కడగండ్లను మిగిల్చాయి. వరుణుడి ఉగ్రరూపంతో పంట పొలాల్లోకి నీరు చేరింది. వరి, పత్తి, మొక్కజొన్న పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. నారింజ వాగు పరీవాహక ప్రాంతాల్లో సోయా, మినుముల పంటలు దెబ్బతిన్నాయి. పంటలు వర్షార్పణమయ్యాయని, అధికారులు సర్వే చేసి పంట నష్టపరిహారం ఇప్పించాలని సంగారెడ్డి, మెదక్ జిల్లాల రైతులు కోరుతున్నారు. సిద్దిపేట జిల్లాలో వ్యవసాయాధికారులు పంట పొలాలను పరిశీలించి నష్టాన్ని అంచనా వేసి రైతులకు సూచనలిస్తున్నారు.

కడగండ్లు

వరుణుడి ఉగ్రరూపంతో అన్నదాతకు తీరని నష్టం

పలుచోట్ల ఇంకా వరద నీటిలోనే పొలాలు

కోహీర్, సెప్టెంబరు 5 : కోహీర్ నారింజ వాగు పరీవాహక ప్రాంతాల్లోని పంట పొలాలన్నీ ఇంకా వరద నీటిలోనే ఉన్నాయి. కోహీర్, పైడిగుమ్మల్, పోతిరెడ్డిపల్లి, కవేల్లి, రాజనెల్లి, గురుజువాడ, మద్రి గ్రామాల పరిధిలో పంటలు దెబ్బతిన్నాయి. పొలాల్లో చేరిన వరద నీరు బయటకు వెళితే తప్ప నష్ట నివారణ నుంచి గట్టెక్కే పరిస్థితి కనిపించడం లేదు. నారింజ పరీవాహక ప్రాంతాల్లో అధికంగా నల్లరేగడి భూములు ఉండడంతో రైతులు ప్రతీ ఖరీఫ్ సీజన్‌లో మొక్కజొన్న, పత్తి, సోయా, మినుము పంటలను ఎక్కువగా సాగు చేస్తారు. నారింజ పరీవాహ ప్రాంతంలో సాగునీరు లేకపోవడంతో చాలామంది రైతులు ఖరీఫ్‌లోనే పంటలను సాగు చేస్తారు. ఖరీఫ్ సీజన్‌లో ఆర్థికంగా లబ్ధి పొందాలనుకున్న రైతులకు అధిక వర్షాలు కురియడంతో కడగండ్లే మిగిలాయి. గతేడాది భారీ వర్షాలకు మండలంలో చాలా పంట దెబ్బతిన్నది.

వాలిపోతున్న తెల్లబంగారం

అల్లాదుర్గం : నాలుగైదు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో అల్లాదుర్గం మండలంలోని పలు గ్రామాల్లో పత్తి పంట దెబ్బతినడంతో తీవ్రనష్టం వాటిల్లినట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో నల్లరేగడి భూములు ఉండటంతో ఎక్కువగా రైతులు పత్తి సాగుపైనే ఆసక్తి కనబరచగా ఈ సీజన్‌లో 13 వేల పైచిలుకు ఎకరాల్లో పత్తిని సాగు చేశారు. రైతులు ఆశించిన స్థాయిలో పంట ఎదిగి పూత పూసి, కాత దశకు చేరుకునే సమయంలో వర్షంతో మండలంలోని ముప్పారం, బహిరన్‌దిబ్బ, చిల్వర్, అల్లాదుర్గం తదితర గ్రామాల శివారులో పత్తి పంటలు దెబ్బతిన్నాయి. పత్తి వాలిపోవడం, నీరు పట్టడం తదితర కారణాలతో దిగుబడి తగ్గి తీవ్రంగా నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.

రేగోడు మండలంలో..

రేగోడు : మండలంలో అధికంగా పత్తి సాగు చేస్తున్నారు. ఐదు రోజులుగా కురుస్తున్న వర్షానికి పత్తి పంట నీరు పట్టి వాడిపోతుందని రైతులు వాపోతున్నారు. పూత, పిందెలు రాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెసర, మినుము పంటలు వర్షానికి దెబ్బతిన్నాయి.

పంటల పరిశీలన.. సూచనలు

సిద్దిపేట జిల్లాలో వ్యవసాయాధికారులు గురువారం పంట పొలాలను సందర్శించి నష్టాన్ని అంచనా వేసి, రైతులకు పలు సూచనలు చేశారు.

● చిన్నకోడూరు : మండలంలోని అల్లీపూర్, ఇబ్రహీం నగర్, చిన్నకోడూరు, గోనెపల్లి, అనంతసాగర్ గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారులు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. మండల వ్యాప్తంగా 90 ఎకరాల్లో వరి, 30 ఎకరాల్లో మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లినట్లు ఏవో జయంత్‌కుమార్ తెలిపారు.

● దౌల్తాబాద్ : మండల పరిధిలోని గాజులపల్లి గ్రామంలో మొక్కజొన్న పంట నేలకొరిగింది. గురువారం దుబ్బాక డివిజన్ ఏడీఏ మల్లయ్య పంట నష్టపోయిన రైతులు మారుపాక రమేష్, పడిగే కనకయ్య, మోతే భిక్షపతితో కలిసి దెబ్బతిన్న పంటలను పరిశీలించి నష్టాన్ని అంచనా వేశారు. మండలంలో 10 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశామని ఏడీఏ మల్లయ్య తెలిపారు. ప్రస్తుతం వర్షాల వల్ల పంట చేలల్లో నీరు నిల్వకుండా బయటకు పంపించాలని రైతులకు సూచించారు.

● మద్దూరు : మండలంలోని ధర్మారం గ్రామంలో మండల వ్యవసాయాధికారి బి.రామకృష్ణ, ఏఈవో అఖిల్‌తో కలిసి మొక్కజొన్న పంటను సందర్శించారు. అధిక వర్షాల వల్ల బ్యాక్టీరియా కాండం కుళ్లుతెగుళ్ల ఆశించే అవకాశం ఉందన్నారు. ఎకరాకు 20 కిలోల యూరియా, 15 కిలోల పొటాషియం వేసుకోవాలని సూచించారు. కాండం కుళ్లు నివారణకు ఎకరాకు బ్లీచింగ్ పౌడర్‌ను ఐదు కిలోలు వేసుకోవాలన్నారు. కత్తెర పురుగు సోకితే 0.3 క్లోరాంత్రినిపోల్‌ను పిచికారీ చేయాలన్నారు. ఈ పాటు రైతులు పాల్గొన్నారు.

నీటి నిల్వతో పత్తిలో 'పారా విల్ట్'



మర్కుక్ ఇప్పలగూడెంలో పత్తిపంటను పరిశీలిస్తున్న ఏవో

మర్కుక్/జగదేవ్‌పూర్ : మర్కుక్ మండలంలోని ఇప్పలగూడెం, చేబర్తి గ్రామాల్లో దెబ్బతిన్న పత్తి పొలాలను మండల వ్యవసాయ అధికారి డాక్టర్ టి.నాగేందర్‌రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు రజనీకాంత్, విష్ణువర్ధన్‌తో కలిసి పరిశీలించారు. జగదేవ్‌పూర్ మండలంలోని ఆలిరాజుపేటలో పత్తి పంటలను మండల వ్యవసాయాధికారి వసంతరావు సందర్శించారు. వారు రైతులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతం అధిక వర్షాలకు పత్తి పొలాల్లో నీరు నిల్వడంతో పారా విల్ట్ లేదా సడెన్ విల్ట్ అధికంగా ఉండటం గమనించామని తెలిపారు. దీని లక్షణాలు ఇతర తెగుళ్ల లక్షణాలను పోలి ఉండటంతో అయోమయానికి గురిచేస్తుందన్నారు. ఈ రుగ్మతతో ఆకులు ఎండిపోవడం, రంగు మారడం వంటి లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. వేగంగా పెరిగే మొక్కలు, అధికంగా పైఆకులు, పత్తి కాయలు ఉన్న మొక్కల్లో ఈ రుగ్మత ప్రభావం చూపిస్తుందని పేర్కొన్నారు. కాయలు, ఆకులు రాలిపోవడం, కాయలు విచ్చుకోకపోవడం జరగవచ్చని తెలిపారు. దీని నివారణకు పొలంలో ఉన్న నీటిని బయటికి పంపించాలన్నారు. సాధ్యమైనంత వరకు వేర్లకు గాలి తగిలేటట్లు చేయాలి. తరువాత ఒక లీటర్ నీటికి 5 గ్రాముల 19-19-19 గానీ లేదా 13-0-45 కానీ, 3 గ్రాముల కాపర్ ఆక్సీ క్లోరైడ్ కలిపి ద్రావణాన్ని తయారు చేసి మొక్కల వేర్లు తడిచేటట్లు పోసుకోవాలి. ఎండలు వచ్చినట్లయితే మొక్కలు త్వరగా కోలుకుంటాయని తెలిపారు.







కోహీర్, అల్లాదుర్గం మండలం ముప్పారంలో నీటిలో మురుగుతున్న పత్తి, రేగోడు మండలం పెద్దతండాలో ఆరబెడుతున్న మినుముల పంట, చిన్నకోడూరులో వరి పంటను పరిశీలిస్తున్న ఏవో, దౌల్తాబాద్ మండలం గాజులపల్లిలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏడీఏ

కనిపించకుండా పోయిన వ్యక్తి.. చెరువులో శవమై లభ్యం



మెగావత్ సురేష్(ఫైల్)

కౌడిపల్లి, సెప్టెంబరు 5 : కనిపించకుండా పోయిన వ్యక్తి చెరువులో శవమై కనిపించిన సంఘటన మండల కేంద్రంలోని జరిగింది. మృతుడి కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. బతుకమ్మ తండాకు చెందిన మెగావత్ సురేష్(35) ఈనెల 3వతేదీన వ్యవసాయ పనుల నిమిత్తం బయటకు వెళ్లి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు బంధువులు, సురేష్ స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. ఇదే క్రమంలో బుధవారం కౌడిపల్లి పెద్దచెరువు సమీపంలో దుస్తులు, సెల్‌ఫోన్ కనిపించాయి. గురువారం మృతదేహం చెరువులో లభించింది. సురేష్ కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కౌడిపల్లి ఎస్ఐ రంజిత్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాళం వేసిన ఇళ్లే లక్ష్యం

- పగలు రెక్కీ.. రాత్రుల్లో దొంగతనం
- వాహన తనిఖీల్లో నిందితుడిని పట్టుకున్న పోలీసులు



రికవరీ చేసిన నగలను, నిందితుడిని చూపిస్తున్న పోలీసులు

కొండాపూర్, సెప్టెంబరు 5 : పగలంతా రెక్కీ నిర్వహించి తాళం వేసిన ఇళ్లను లక్ష్యం చేసుకుని రాత్రి వేళలో దొంగతనానికి పాల్పడుతున్న నిందితుడిని కొండాపూర్, సంగారెడ్డి సీసీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గురువారం కొండాపూర్ సీఐ చంద్రయ్య వివరాలను వెల్లడించారు. సూర్యపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం కరక్కాయలగూడెంకు చెందిన సన్నిధి ఆంజనేయులు(30) తాపీ మేస్త్రీగా పనిచేస్తుంటాడు. జల్సాలకు, తాగుడుకు బానిసై ఇళ్ల, బైక్ దొంగతనాలకు పాల్పడుతున్నాడు. బుధవారం రాత్రి మల్కాపూర్ చౌరస్తాలో కొండాపూర్ పోలీసులు, సీసీఎస్ పోలీసులతో కలిసి వాహన తనిఖీలు చేస్తుండగా అనుమానంగా కన్పించిన ఆంజనేయులును అదుపులోకి తీసుకుని విచారించారు. 30 ఇళ్ల చోరీల్లో 39.4 తులాల బంగారం, 188 తులాల వెండి, రూ.9.50 లక్షల నగదు, రెండు బైకులను అపహరించినట్లు వెల్లడించారు. మొబైల్ ఫోన్ వాడకుండా ఎటువంటి సామగ్రి తీసుకెళ్లకుండా ఒంటరిగా వెళ్లి ఇంటి ఆవరణలో ఉండే ఇనుపరాడ్లు, రాళ్లతో తాళాలను పగులగొట్టి అపహరించేవాడు. నిందుతడిపై మెదక్, సంగారెడ్డి, సూర్యాపేట, నల్గొండ, ఖమ్మం, వరంగల్, వికారాబాద్ జిల్లాలోని పోలీస్‌స్టేషన్‌లలో దొంగతనం కేసులు నమోదైనట్లు తెలిపారు. నిందుతుడి నుంచి 15 తులాల బంగారంను రికవరీ చేసి రిమాండ్‌కు పంపించినట్లు సీఐ తెలిపారు. నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్న కొండాపూర్, సీసీఎస్ పోలీసులకు సీఐ రివార్డులను అందజేశారు.

తూప్రాన్ ఆర్టీసీ బస్టాండ్‌లో నగలు చోరీ

తూప్రాన్, సెప్టెంబరు 5 : తల్లిగారింటి వద్ద ఉన్న బంగారు నగలను ఇంటికి తీసుకెళ్తున్న మహిళ బ్యాగ్‌లో నుంచి చోరీకి గురైన సంఘటన తూప్రాన్ ఆర్టీసీ బస్టాండ్‌లో గురువారం సాయంత్రం చోటుచేసుకున్నది. తూప్రాన్ ఎస్ఐ శివానందం కథనం ప్రకారం... రంగారెడ్డి జిల్లా ఫరూక్‌నగర్ మండలం లింగారెడ్డిగూడెం గ్రామానికి చెందిన చల్ల శ్రీకాంత్‌రెడ్డి భార్య చల్ల మమత గురువారం ఉదయం శివ్వంపేట మండలం ఉసిరికపల్లిలోని తల్లిగారింటికి వెళ్లింది. అన్న భార్య రజిత గత నెల 20న పెళ్లి కోసం మమత వద్ద ఉన్న ఐదు తులాల బంగారు ఆభరణాలు లాంగ్ చైన్, కమ్మలు తీసుకుని స్వగ్రామానికి బయలుదేరింది. సాయంత్రం 5 గంటలకు ఉసిరికపల్లి నుంచి గజ్వేల్ వెళ్లే బస్సులో తూప్రాన్ వరకు వచ్చింది. తూప్రాన్ నుంచి రామాయంపేట నుంచి సికింద్రాబాద్ వెళ్లే బస్సులో స్వగ్రామం వెళ్లేందుకు 5.30 గంటలకు ఎక్కింది. బస్సులో కూర్చోగానే హ్యాండ్‌బ్యాగ్‌లో పెట్టుకున్న బంగారు ఆభరణాలు చూడగా కనిపించలేదు. తూప్రాన్ ఆర్టీసీ బస్టాండ్‌లో వెతికినప్పటికీ లభించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానందం వివరించారు.

10న మెడికల్ కాలేజీలో వాక్-ఇన్ ఇంటర్వ్యూలు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 5 : సంగారెడ్డిలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఈ నెల 10వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా. సుధామాధురి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొఫెసర్, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ట్యూటర్, సీనియర్ రెసిడెంట్స్‌ను కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేయుటకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తు ఫారాలు కళాశాల వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని, ఆసక్తి కలిగిన వారు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు హాజరుకావాలని ఆమె కోరారు.

పాపన్నపేట పీహెచ్‌సీకి సుస్తీ!

- గ్రామాల్లో విష జ్వరాల పడగ.. అందని వైద్యం
- ఇటీవల డెంగ్యూతో బాలుడి మృతి

పాపన్నపేట, సెప్టెంబర్ 5 : పాపన్నపేట మండలంలో విషజ్వరాలు విలయతాండవం చేస్తున్నాయి. మండల పరిధిలోని చీకోడ్ గ్రామంలో ఆరు డెంగ్యూ కేసులు వెలుగులోకి వచ్చాయి. కాగా అందులో ఒక బాలుడు ఇటీవలే మృతి చెందిన విషయం తెలిసిందే. మిన్పూర్ గ్రామంలో ఒకే ఇంట్లో ముగ్గురు డెంగ్యూ బారిన పడ్డారు. ఇలా మండల వ్యాప్తంగా డెంగ్యూ, చికున్ గున్యా, వైరల్ జ్వరాలతో మండల వాసులు ప్రైవేటు దవాఖానలలో వేలు ఖర్చు పెట్టుకుంటున్నారు. మండల పరిధిలో 24 గంటలు వైద్య సేవలు అందించే పాపన్నపేటలో ఒక ఆరోగ్య కేంద్రం ఉండగా పొడ్చన్‌పల్లిలోనూ మరో ఆరోగ్య కేంద్రం ఉంది. రెండు ఆసుపత్రుల్లోనూ సిబ్బంది కొరత వెక్కిరిస్తుంది. ఉన్న సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల జిల్లా వైద్యాధికారి పాపన్నపేట ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన విషయం తెలిసిందే. డెంగ్యూ కేసుల నమోదుపై ఆయనను వివరణ కోరగా పాపన్నపేట మండలంలో ఒక్క డెంగ్యూ కేసు నమోదు కాలేదని పేర్కొనడం విడ్డూరంగా ఉంది. వైద్య సిబ్బంది మాత్రం డెంగ్యూ కేసులు ఉన్నట్లు వారే స్వయంగా ఒప్పుకుంటున్నారు.



పాపన్నపేట పీహెచ్‌సీలో ఖాళీగా దర్శనమిస్తున్న వైద్యుడి కుర్చీ



డెలివరీ గదిలో ఊడిన కిటికీ రెక్కలు

అందని ద్రాక్షలా వైద్యం

పాపన్నపేట పీహెచ్‌సీలో ఒకపక్క సిబ్బంది కొరత వేధిస్తుంటే.. ఇన్‌చార్జి డాక్టర్ల సేవలు రోగులకు అందని ద్రాక్షలా మారాయి. చిన్న చిన్న రోగాలకు సైతం వైద్యం అందించలేని దుస్థితిలో పాపన్నపేట ఆరోగ్య కేంద్రం ఉంది. ఉన్న సిబ్బంది విధులకు ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు పోతారో.. తెలియని పరిస్థితి నెలకొన్నది. వచ్చిన సిబ్బంది వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఆసుపత్రిలో ఉన్న గదుల పైకప్పులన్నీ లీకేజీలు అవుతుండటంతో లోపలి భాగం చిత్తడిగా మారింది. డెలివరీ గదితో పాటు ఇతర గదులకు కిటికీ రెక్కలు లేవు. ఆస్పత్రి ఆవరణ అపరిశుభ్రంగా ఉంది. రాత్రివేళల్లో విధులు నిర్వహించాల్సిన ఏఎన్ఎంలు భయం గుప్పిట్లో బతుకుతున్నారు. గ్రామానికి కొంత దూరంలో ప్రభుత్వ దవాఖాన ఉండటంతో వారికి ఇబ్బందులు తప్పడంలేదు. కరెంటు పోయిన సందర్భాలలో ఇన్వర్టర్ సౌకర్యం లేక చిమ్మ చీకట్లోనే ఏఎన్ఎంలు విధులు నిర్వహించాల్సి వస్తుంది. 2008లో ఇక్కడ ఆయుష్ పరిధిలో హోమియో వైద్యం అందుబాటులోకి తెచ్చినప్పటికీ సిబ్బంది కొరత ఉంది. ఇక్కడికి కేటాయించిన వైద్యుడు డిప్యూటేషన్‌పై వెళ్లడంతో హోమియో వైద్యం అందించే వారే కరువయ్యారు.

పోస్టులు ఖాళీ

ఆస్పత్రిలో శాశ్వత వైద్యుడి పోస్టుతో పాటు మెడికల్ సూపర్‌వైజర్ పోస్టు ఖాళీగా ఉంది. అలాగే రెగ్యులర్ స్టాఫ్‌నర్స్, ముగ్గురు ఎస్‌హెచ్ స్టాఫ్ నర్సుల పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. వీరితో పాటు ముగ్గురు సెకండ్ ఏఎన్ఎంల పోస్టులు ఖాళీ ఉండగా గత కొన్ని సంవత్సరాలుగా వీటిని భర్తీ చేయడంలేదు. శాశ్వత వైద్యులు లేకపోవడంతో శంకరంపేట(ఎ) నుంచి ఒకరిని, రామాయంపేట నుంచి మరొకరిని ఇక్కడ ఇన్‌చార్జి డాక్టర్లుగా నియమించారు. వీరు ఎప్పుడు వస్తారో ఎవరికీ తెలియదు. వచ్చినా సమయానికి రారు అంటూ రోగులు వాపోతున్నారు.



ఆస్పత్రి ఆవరణలో చేరిన నీరు

లచ్చిరెడ్డీ... చౌకబారు ప్రకటనలు మానుకో

- వంద కోట్లు తానే విరాళం ఇచ్చినట్టు వ్యవహరించడం సరికాదు
- తెలంగాణ ఉద్యోగుల జేఏసీ తీవ్రంగా ఖండిస్తుంది
- ఉద్యోగుల సంఘం జిల్లా జేఏసీ చైర్మన్ జావిద్‌అలీ ధ్వజం



మాట్లాడుతున్న జావిద్ అలీ

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 5 : ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల జేఏసీ వరద బాధితులకు ఆపన్నహస్తంగా నిలిచి ప్రభుత్వానికి రూ.130 కోట్ల విరాళంగా ఇచ్చిన తరుణంలో నాయకుడు లచ్చిరెడ్డి తానే వంద కోట్లు ఇచ్చినట్లు ప్రకటించడాన్ని ఉద్యోగుల సంఘం జిల్లా జేఏసీ చైర్మన్ జావిద్‌అలీ తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. సంగారెడ్డిలోని టీఎన్‌జీవోస్ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తహసీల్దార్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఉండి, గత ప్రభుత్వానికి కొమ్ముకాసిన లచ్చిరెడ్డి, ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. గుర్తింపు పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాలు భాగస్వామిగా ఉన్న జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, ఏలూరి శ్రీనివాసరావు నాయకత్వంలో వారి శ్రేయస్సు కోసం కృషి చేస్తున్న సందర్భంలో లచ్చిరెడ్డి ప్రకటన గందరగోళం సృష్టించే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎలాంటి గుర్తింపు లేని సంఘం నాయకుడు లచ్చిరెడ్డి అని అన్నారు. ఈ సమావేశంలో జేఏసీ కో చైర్మన్ వైద్యనాథ్, పెన్షనర్ల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, టీఎన్‌జీవో జిల్లా కార్యదర్శి వి.రవి, అసోసియేట్ అధ్యక్షుడు కసిని శ్రీకాంత్, వెంకట్‌రెడ్డి, టీజీవో కార్యదర్శి సంతోష్, టీహెచ్‌డబ్ల్యూవో రాష్ట్ర అధ్యక్షుడు గౌస్, విజయ్‌కుమార్, రవికృష్ణ, కృష్ణ, వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తూప్రాన్ ఎస్‌బీఐ వద్ద ఖాతాదారుల ఆందోళన

- సర్వర్ పనిచేయడం లేదని బ్యాంకుకు తాళం
- నెలరోజులైనా రుణాలు రెన్యూవల్ చేయంలేదని ఆగ్రహం

తూప్రాన్, సెప్టెంబరు 5 : సర్వర్ పనిచేయకపోవడంతో బ్యాంకుకు తాళం వేయడం, నెల రోజులుగా రుణాల కోసం వస్తున్న రైతులను పట్టించుకోకపోవడంపై ఖాతాదారులు ఆగ్రహించారు. బ్యాంకు వద్దకు వచ్చిన ఖాతాదారులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళన చేపట్టారు. ఈ సంఘటన మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) వద్ద గురువారం చోటుచేసుకున్నది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సర్వర్ ఎన్‌బీసీకి బుధవారం మార్చారు. ఒక్కొక్క బ్యాంక్ శాఖను మార్చుతుండగా, బుధవారం తూప్రాన్ బ్యాంకు శాఖను మార్చారు. కాగా, కొత్త సర్వర్‌లోకి మార్చినప్పటికీ గురువారం పనిచేయలేదు. సర్వర్ డౌన్ కారణంగా తూప్రాన్ బ్యాంకుకు తాళం వేసి మూసేశారు. దాంతో బ్యాంకు వచ్చిన ఖాతాదారులు, రుణమాఫీ జరిగి కొత్త రుణాలు తీసుకోడానికి వచ్చిన రైతులు బ్యాంకు వద్ద పెద్దఎత్తున గుమిగూడారు. రుణమాఫీ పొందిన రైతులకు నెల రోజులు గడిచినప్పటికీ కొత్త రుణాలు ఇవ్వడంలేదని ఆగ్రహించారు. సర్వర్ పనిచేయడంలేదని బ్యాంకుకు తాళం వేసి బయట నిలిపివేశారని మండిపడ్డారు. బ్యాంకుకు వస్తే సరైన సమాధానం చెప్పకుండా విసుక్కుంటున్నారని రైతులు ఆరోపించారు. బ్యాంకుకు తాళం వేసి పెట్టడం, రుణాలు ఇవ్వకపోవడంపై ఆగ్రహిస్తూ ఖాతాదారులు ఆందోళన చేపట్టారు. ఈ విషయమై బ్యాంకు మేనేజర్ రామేశ్వర్‌రెడ్డిని వివరణ కోరగా సర్వర్ ప్రాబ్లమ్ రావడంతోనే బ్యాంకుకు తాళం వేసి ఉంచామని, లోపలకు వస్తే ఇబ్బంది పెడతారని అలా చేశామన్నారు. రుణాల విషయం తన దృష్టికి రాలేదని, కొత్తగా 15 రోజుల క్రితమే బ్యాంకుకు వచ్చినట్లు చెప్పారు. ఒక్కరే ఫీల్డ్ ఆఫీసర్ ఉండటంతో కొత్తగా ఎక్కువ రుణాలు ఇవ్వలేకపోతున్నామని తెలిపారు.



తూప్రాన్‌లోని ఎస్‌బీఐ బ్యాంకుకు తాళం వేయడంతో బయట ఖాతాదారులు

అంతర్జాతీయ పవర్‌లిఫ్టింగ్ పోటీలకు తపస్య



పవర్ లిఫ్టింగ్ చేస్తున్న సూరినేని తపస్య

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి), సెప్టెంబరు 5 : అతిపిన్న వయసులో అంతర్జాతీయ పవర్‌లిఫ్టింగ్ పోటీలకు సంగారెడ్డి యువ లిఫ్టర్ సూరినేని తపస్య అర్హత సాధించి, సంచలనం సృష్టించింది. 11 ఏళ్ల ప్రాయంలోనే పవర్‌లిఫ్టింగ్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే అరుదైన అవకాశం తపస్యకు లభించింది. ఇటీవల జరిగిన జాతీయ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం నెగ్గిన తపస్య వచ్చే నవంబరులో అమెరికాలో జరిగే వరల్డ్ చాంపియన్‌షిప్‌కు అర్హత సాధించింది. ఈ పోటీల్లో తపస్య 44 కిలోల 'రా లిఫ్టింగ్' ఈవెంట్‌లో పోటీ పడనుంది. అయితే, ఈ పోటీల్లో పాల్గొనేందుకు రూ.2.50 లక్షల వరకు ఖర్చు అవనుండడంతో పేద కుటుంబానికి చెందిన ఈ అమ్మాయి ప్రభుత్వం, దాతల సహాయం కోసం ఎదురు చూస్తోంది. ఈ అమ్మాయికి సహాయం చేయదలిచిన వారు 8790022909 ఈ నెంబరుకు సంప్రదించవచ్చు.

చెట్టెక్కిన చింతకాయ

వినాయక ఉత్సవాలకు కొత్త పచ్చడి కష్టమే



నారాయణఖేడ్, సెప్టెంబరు 5: వినాయక ఉత్సవాలు వచ్చాయంటే ప్రతి ఒక్కరికి గుర్తుకు వచ్చేది కొత్త చింతకాయ పచ్చడి, తుమ్మికూర. ఈసారి ఉత్సవాలకు వీటిని రుచిచూడటం కష్టమే అంటున్నారు. ఈ సంవత్సరం చింతకాయ కాత అంతంత మాత్రంగానే ఉండడానికి తోడు, ప్రస్తుతం వర్షాలు అధికంగా కురియడంతో, కాసిన కొద్దిపాటి చింతకాయను కూడా చెట్టు నుంచి తెంపలేని పరిస్థితి నెలకొంది. వర్షాల వల్ల తుమ్మికూర సైతం అంతంత మాత్రంగానే పండింది. దీంతో పండగకు ప్రధానంగా అవసరమైన చింతకాయను గురువారం నారాయణఖేడ్ మార్కెట్‌లో కిలో రూ.200 చొప్పున విక్రయించారు. అయినప్పటికీ పండగకు కొత్త చింతకాయ అవసరం కావడంతో ఎంతోకొంత కొనుగోలు చేస్తున్నారు. తుమ్మికూర గురువారం వరకు మార్కెట్‌లోకి అందుబాటులోకి రాలేదు.



కుకునూరుపల్లి: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న తహసీల్దార్, ఎంఈవో, పొల్కంపల్లి నరేందర్



తొగుట: గుడికందుల పాఠశాలలో ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న విద్యార్థులు



బెజ్జంకి: ఎమ్మార్సీ కార్యాలయంలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంపీడీవో, ఎంఈవో



కొండపాక : దమ్మకపల్లిలో ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న విద్యార్థులు, తదితరులు

భవిష్యత్తును తీర్చిదిద్దేది ఉపాధ్యాయుడే

విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని అధికారులు, పలువురు పేర్కొన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా గురువారం గురుపూజోత్సవం నిర్వహించారు. ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రయోజకులుగా మారితే తల్లిదండ్రుల తర్వాత ఎక్కువగా సంతోషించేది వారేనని పేర్కొన్నారు.

- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్



దుబ్బాక: దుబ్బాకలో స్వపరిపాలన దినోత్సవంలో ఉపాధ్యాయుల వేషధారణలో విద్యార్థులు



గజ్వేల్ పట్టణంలోని డిగ్రీ కళాశాలలో గురుపూజోత్సవంలో ప్రిన్సిపాల్ అంజుమ్, తదితరులు



చేర్యాల: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న విద్యార్థులు



మర్కుక్: అంగడికిష్టాపూర్ పాఠశాలలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఏపీఎం బ్రహ్మచారి



దూళిమిట్ట: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న తాజా మాజీ జడ్పీటీసీ గిరి కొండల్ రెడ్డి



గజ్వేల్: పట్టణంలోని కస్తూర్బాలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు



మిరుదొడ్డి:లింగుపల్లిలో ఉపాధ్యాయులను శాలువతో సన్మానిస్తున్న డీపీఎం

మట్టి విగ్రహాలను పూజిద్దాం

● గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి

గజ్వేల్, సెప్టెంబరు 5: మట్టి విగ్రహాలను పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడుదామని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి పిలుపునిచ్చారు. గజ్వేల్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మట్టి వినాయక ప్రతిమలను గజ్వేల్ మండల కుమ్మర సంఘ నాయకులు ఆయనకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ విగ్రహాల వల్ల పర్యావరణానికి ఎంతో నష్టం వాటిల్లుతుందన్నారు. ఆయనవెంట కుమ్మర సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగపురి రమేశ్, గజ్వేల్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కొలిచెలిమి స్వామి, గజ్వేల్ మండల అధ్యక్షుడు నాగపురి బాబు, తొవ్వల యాదగిరి, మల్లేశం, పోచయ్య, కొండల్, రమణాకర్, కిషోర్ ఉన్నారు.

● **చేర్యాల:** వినాయకనవరాత్రోత్సవాలను పురస్కరించుకుని శ్రేష్ఠమైన మట్టివిగ్రహాలను పూజించి పర్యావరణాన్ని కాపాడుకుందామని చేర్యాల మండల ఐకేపీ ఏపీఎం ప్రకాశ్ కోరారు. చేర్యాల మండల శ్రీనిధి మండల సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం చేర్యాలలో మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను పూజించాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనిధి మండల సమాఖ్య అధ్యక్షురాలు సుజాత, గుండా చంద్రం, ఐకేపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



గజ్వేల్: మట్టి వినాయక ప్రతిమలను చైర్మన్‌కు అందజేస్తున్న నాయకులు

అధ్వానంగా రోడ్లు

● వరుస వర్షాలతో బురదమయం

● పట్టించుకోని అధికారులు

జగదేవ్‌పూర్, సెప్టెంబరు 5: పేరుకే ఆదర్శ గ్రామం. అంతర్గత రోడ్లన్నీ అధ్వానం. చినుకు పడితే చాలు రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయి. సీసీ రోడ్లు అయినప్పటికీ మట్టి రోడ్లుగా మురుగుగుంతలుగా అస్తవ్యస్తంగా మారాయి. పట్టించుకోవలసిన అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని తిమ్మాపూర్‌లో గతంలో పారిశుధ్యంలో ఆదర్శంగా నిలిచింది. సెర్ప్ ఆధ్వర్యంలో ఆ గ్రామాన్ని దత్తత తీసుకొని అన్ని రంగాల్లో అభివృద్ధి పరచి మిగతా గ్రామాలకు ఆదర్శంగా తయారు చేశారు. రోడ్డుపై మురుగు కాలువ లేకుండా అండర్ డ్రైనేజ్ నిర్మాణం చేపట్టారు. అలాగే ప్రతీ వాడకు సీసీ రోడ్లు నిర్మించారు. ఇదంతా బాగానే ఉన్నప్పటికీ ప్రస్తుతం అంతర్గత రోడ్లన్నీ అధ్వానంగా మారాయి. చినుకు పడితే చాలు ఆ గ్రామంలో బజారులన్నీ బురదమయంగా మారుతున్నాయి. వర్షం నీరు రోడ్లపై నిలవడంతో గుంతలు పడి నడవలేని పరిస్థితికి చేరుకున్నాయి. తిమ్మాపూర్ నుంచి బస్వాపూర్ కు వెళ్లే సీసీ రోడ్డు పూర్తిగా కుంగిపోయి మట్టిరోడ్డుగా మారింది. అలాగే అనంతసాగర్ వెళ్లే సీసీ రోడ్డు మొత్తం మట్టి రోడ్డుగా మారింది. పలుసార్లు ఆ రోడ్డుపై మట్టి పోయడంతో గుంతలు ఏర్పడి వర్షం నీరు నిలిచి బురదమయంగా మారుతున్నాయి. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని గ్రామస్థులు వాపోతున్నారు. వర్షం నీరు వెళ్లేందుకు కాల్వలు నిర్మించలేదని, దీంతో సమస్య ఏర్పడుతున్నదని గ్రామస్థులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



జగదేవ్‌పూర్: తిమ్మాపూర్‌లో బురదమయంగా రోడ్డు



కుకునూరుపల్లి: గుంతలమయంగా బొప్పాయిపల్లి రోడ్డు

కుకునూరుపల్లి నుంచి బొప్పాయిపల్లికి వెళ్లే..

కుకునూరుపల్లి, సెప్టెంబరు 5: కుకునూరుపల్లి నుంచి బొప్పాయిపల్లికి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. ఆర్‌అండ్‌బీ ద్వారా రెండు కిలోమీటర్ల రోడ్డుకి రూ. ఐదు కోట్ల 80 లక్షలతో కాంట్రాక్టర్ టెండర్ దక్కించుకోగా నిధుల లేమితో పనులు ప్రారంభించలేదు. ఇదే రోడ్డు గుండా కొండపోచమ్మ ఆలయానికి, మరో 5 గ్రామాల ప్రజలు ఈ రోడ్డు గుండానే ప్రయాణాలు సాగిస్తుంటారు. భారీ వర్షాలకు మట్టి రోడ్డు పూర్తిగా ధ్వంసమై గుంతలమయంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పనులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మండల రెడ్డి జాగృతి అధ్యక్షుడిగా దయాకర్‌రెడ్డి

రాయపోల్, సెప్టెంబరు 5: రాయపోల్ మండల రెడ్డి జాగృతి అధ్యక్షుడిగా రాయపోల్‌కు చెందిన గల్ల దయాకర్‌రెడ్డిని నియమించారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు డీఎస్‌రెడ్డి గురువారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. పేద రెడ్డిల సంక్షేమం కోసం శాయశక్తులా కృషి చేస్తానని, సంఘాన్ని మరింత బలోపేతం చేస్తానని పేర్కొన్నారు. తనను నియమించిన జిల్లా అధ్యక్షుడు డీఎస్‌రెడ్డి, రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

మృతుడి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

బెజ్జంకి, సెప్టెంబరు 5: మండలంలోని తోటపల్లి గ్రామానికి చెందిన సందిరి లక్ష్మణ్ ఇటీవల చేపల వేటకు వెళ్లి మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మానకొండూరు మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ గురువారం మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, లక్ష్మణ్, శ్రీనివాసరావు, బాబు, సాయి రావు తదితరులు ఉన్నారు.

వరద బాధితులకు వీడియో జర్నలిస్టుల ఆర్థికసాయం

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబర్ 5: సిద్దిపేట వీడియో జర్నలిస్టులు వరద బాధితులకు అండగా నిలబడటానికి ముందుకొచ్చారు. గురువారం మాజీ మంత్రి హరీశ్‌రావును కలిసి సిద్దిపేట వీడియో జర్నలిస్టుల సంఘం తరఫున రూ. 10 వేల నగదును వరద బాధితుల కోసం అందజేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు వీడియో జర్నలిస్టులను అభినందించారు. చిరుద్యోగులు అయినప్పటికీ పెద్ద మనసుతో ముందుకురావటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎల్లోహర్, గిరి, వెంకట్, నవీన్, చందు, అంజి, నరేష్, రమేష్, ప్రవీణ్, కృష్ణ, మహేష్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

హుస్నాబాద్, సెప్టెంబరు 5: హుస్నాబాద్ పట్టణంలోని 132/33కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా నేడు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. హుస్నాబాద్ పట్టణంతో పాటు రూరల్, అక్కన్నపేట మండలాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు.

బీఎల్‌వోలతో సమావేశం

జిన్నారం: బొల్లారం మున్సిపాలిటీలో నూతన ఓటరు నమోదు కోసం మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్ నిర్మల, ఆర్వో నర్సింహులు, మండల ఆర్ఐ జయప్రకాష్‌లు బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. నూతన ఓటరు నమోదు కోసం ఇంటింటి సర్వే నిర్వహించాలన్నారు.

రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైంది

● బీజేపీ మహిళా మోర్చా నాయకురాలు ఉమారెడ్డి



పాత బస్టాండ్ వద్ద నిరసన తెలుపుతున్న బీజేపీ మహిళా మోర్చా నాయకులు

సిద్దిపేట క్రైం, సెప్టెంబరు 5: రాష్ట్రంలో మహిళలకు రక్షణ, భద్రత కరువైందని జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు ఇర్రి ఉమారెడ్డి మండిపడ్డారు. ఆసిఫాబాద్ జిల్లా జైనూర్‌లో గిరిజన మహిళపై లైంగిక దాడి యత్నాన్ని నిరసిస్తూ సిద్దిపేట పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద గురువారం నిరసన తెలిపారు. సిద్దిపేట జిల్లా బీజేపీ మహిళా మోర్చా నాయకులు రోడ్డుపై బైఠాయించి సీఎం ఫ్లెక్సీని దహనం చేశారు. ఈ సందర్భంగా సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వంలో ఎవరికి రక్షణ లేదని, రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే కఠిన చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు.

పెద్ద చెరువు మత్తడి వద్ద కాంగ్రెస్ నాయకుల పూజలు

చిన్నకోడూరు, సెప్టెంబరు 5: చిన్నకోడూరు పెద్ద చెరువు ఇటీవల కురిసిన వర్షాలకు మత్తడి దూకుతుంది. కాంగ్రెస్ నాయకులు గ్రామస్థులతో కలిసి గురువారం మత్తడి వద్ద కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బత్తిని గణేష్ గౌడ్, కాంగ్రెస్ ఫిషర్ మెన్ కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుండు వెంకటేష్, నాయకులు కొరిమి రాజు, గుడిమల్ల మల్లేశం, కొలను గణేష్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



పెద్దచెరువు మత్తడి వద్ద పూజలు చేస్తున్న నాయకులు

గజ్వేల్‌లో మహారాష్ట్ర గ్రూప్-1 అధికారుల పర్యటన

గజ్వేల్/ములుగు, సెప్టెంబరు 5: గజ్వేల్ మండలం అహ్మదీపూర్, దిలాల్‌పూర్ గ్రామాల్లో మహారాష్ట్ర గ్రూప్-1 అధికారుల బృందం గురువారం పర్యటించింది. అహ్మదీపూర్‌లో సెర్ప్ ఆధ్వర్యంలో నిర్వహించిన కష్టం హైరింగ్ సెంటర్, ఫర్టిలైజర్ షాప్, దిలాల్‌పూర్‌లో జ్యూట్ బ్యాగుల తయారీ, స్కూల్ యూనిఫాం తయారీ కేంద్రాలను సందర్శించారు. అనంతరం మండల సమాఖ్య కార్యనిర్వహణ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలను గురించి అడిగి తెలుసుకున్నారు. 25మంది సభ్యుల బృందం పర్యటించగా, వారితో అదనపు డీఆర్‌డీవో మధుసూదన్, డీపీఎం వాసుదేవ్, వినురుద్‌రెడ్డి, ఎంపీఎం దుర్గాప్రసాద్, సీసీలు ఉన్నారు.

మహిళా సమాఖ్య సంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రమైన ములుగులో పాల కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ పాల కేంద్రాన్ని గురువారం మహారాష్ట్ర గ్రూప్-1 అధికారుల బృందం సందర్శించింది.



గజ్వేల్: అహ్మదీపూర్‌లో పర్యటిస్తున్న అధికారులు

విద్యార్థిదశలో తప్పటడుగులు వేయవద్దు

● గజ్వేల్ సీఐ సైదా

● చేర్యాల సీఐ శ్రీను

చేర్యాల, సెప్టెంబరు 5: విద్యార్థి దశ అత్యంత కీలకమని, తప్పటడుగులు వేసి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని చేర్యాల సీఐ ఎల్. శ్రీను సూచించారు. చేర్యాల పట్టణంలోని గాయత్రీ పాఠశాలలో గురువారం నిర్వహించిన విద్యార్థుల సమావేశంలో గంజాయి సేవనంతో అనర్థాలు, షీ టీమ్స్ పనితీరు, ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడవద్దని, సోషల్‌మీడియాలో వచ్చే వదంతులను పట్టించుకోకూడదని సూచించారు. కార్యక్రమంలో షీటీమ్ బృందం సదయ్య, స్వప్న, ప్రశాంతి, పాఠశాల ప్రిన్సిపాల్ అక్బర్ అలీ పాల్గొన్నారు.

● **గజ్వేల్:** ప్రతీ ఒక్కరి జీవితంలో విద్యార్థి దశ కీలకమని గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలోని గీతాంజలి జూనియర్ కళాశాలలో గురువారం గంజాయి, మత్తుపదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలు, ఈవ్‌టీజింగ్, మహిళల రక్షణ చట్టాలు, షీటీమ్స్, నూతన చట్టాలకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మవద్దని, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని సూచించారు. మహిళల భద్రతకు పెద్దపీట వేశామన్నారు. ఆయనవెంట కళాశాల ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి, షీటీమ్స్ ఏఎస్ఐ శ్రీరాములు, కానిస్టేబుళ్లు రామచంద్రారెడ్డి, శ్యామల, లావణ్య, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



చేర్యాల: మాట్లాడుతున్న సీఐ ఎల్. శ్రీనివాస్

గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

● ఎంపీడీవో రామ్మోహన్

మద్దూరు, సెప్టెంబరు 5: గణేష్ నవరాత్రోత్సవాలను మండపాల నిర్వాహకులు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎంపీడీవో రామ్మోహన్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం మండపాల నిర్వాహకులతో ఏర్పాటు చేసిన పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడారు. మండపాల నిర్వాహకులు తప్పని సరిగా నవరాత్రోత్సవాలు ముగిసే వరకు జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో మద్దూరు, దూళిమిట్ట తహ సీల్దార్లు సంజీవ్‌కుమార్, మధుసూదన్, ఎస్ఐ షేక్ మహబూబ్, విద్యుత్ ఏఈ సుధీర్ కుమార్, జీపీ ప్రత్యేకాధికారులు, పంచాయతీ సెక్రటరీలు, మండపాల తదితరులు పాల్గొన్నారు.

● **జగదేవ్‌పూర్:** గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని జగదేవ్‌పూర్ ఎంపీడీవో బి. యాదగిరి అన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆయన ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో యాదగిరి మాట్లాడుతూ.. గణేష్ ఉత్సవాలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రఘువీరారెడ్డి, మండల పంచాయతీ అధికారి ఎండీ. ఖాజా మోహినొద్దీన్, వైద్య సిబ్బంది జితేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం ఎఫ్ఏలు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● **మర్కుక్:** ఎంపీడీవో కార్యాలయంలో తహసీల్దార్ ఆరిఫా అధ్యక్షతన పీస్ కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఇరిగేషన్ ఏఈ, మర్కుక్ ఎస్ఐ, పంచాయతీ సెక్రటరీ, ప్రత్యేకాధికారి తదితరులు పాల్గొన్నారు.

● **దూళిమిట్ట:** వినాయకచవితి, మిలాద్ ఉన్ నబీలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని చేర్యాల సీఐ ఎల్. శ్రీను సూచించారు. దూళిమిట్ట గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన పీస్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జాతి, కులం, మతం అనే బేధాలు లేకుండా ప్రజలందరూ కలిసికట్టుగా పండుగలు నిర్వహించుకోవాలని సూచించారు. హైదారాబాద్‌లో మిలాద్ ఉన్ నబీ పండుగను ఏ రోజు జరుపుకుంటారో అదే రోజు మండలంలోనూ జరుపుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఏ సమస్య ఉన్నా 100 నెంబర్‌కు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మధుసూదన్, లైన్‌మన్ సత్తయ్య మాజీ జడ్పీటీసీ వెంకట్‌గౌడ్, చందు, ముస్లిం మత పెద్దలు రషీద్, కరీం, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

● **హుస్నాబాద్ టౌన్:** శాంతియుతంగా పండుగలను నిర్వహించుకోవాలని సీఐ శ్రీనివాస్ సూచించారు. వినాయక చవితి, మిలాద్ ఉన్ నబీ పండుగల సందర్భంగా హిందు, ముస్లిం మత పెద్దలు, వినాయక మండపాల ఆర్గనైజర్లతో సీఐ శ్రీనివాస్ హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్‌లో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరూ మత సామరస్యాన్ని కాపాడుకుంటూ పండుగలు జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ తోట మహేశ్, టీపీసీసీ మెంబర్ కేడం లింగమూర్తి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, ఎండీ అన్వర్, ఎండీ హసన్, పాషా మియా, షబ్బీర్, భారీ, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



దూళిమిట్ట: సమావేశంలో మాట్లాడుతున్న సీఐ శ్రీను



మద్దూరు: మాట్లాడుతున్న ఎంపీడీవో రామ్మోహన్

మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీలపై చీటింగ్ కేసు

కోహెడ, సెప్టెంబరు 5: మండలంలోని రామచంద్రాపూర్ మాజీ సర్పంచ్ వకలాభరణం భాను ప్రకాష్, అతడి భార్య మాజీ ఎంపీటీసీ మాధవిలపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు గురువారం ఎస్ఐ అభిలాష్ తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కోరుట్ల కొమరవ్వకు చెందిన సర్వేనెంబర్ 478ఇ, 479, 491, 492 లోని మొత్తం ఎకరం భూమి ఉంది. ఈ సర్వే నెంబర్లో భర్త కోరుట్ల కనకయ్య పేరిట ఉన్న ఉన్న ఇంటిని మాజీ సర్పంచ్ వకులాభరణం భాను ప్రకాష్ కొనుగోలు చేశాడు. వకుళాభరణం భాను ప్రకాష్ ఆ ఇంటిని ఉపయోగించుకుని కొమరవ్వకు చెందిన భూమిని కూడా రికార్డుల్లో తన పేరు మీదికి మార్పించుకున్నాడు. ఆ ఇంటితో నాలుగు గుంటలు భూమిని రికార్డుల్లో నమోదు చేసుకుని యజమాన్య ధ్రువీకరణ పత్రం ద్వారా మరో నాలుగు గుంటలు భూమిని తన భార్య మాజీ ఎంపీటీసీ మాధవి పేరున రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. కొద్దిరోజుల నుంచి భాను ప్రకాష్, అతని భార్య మాధవి భూమికి హద్దులు పెట్టకపోతే చంపుతామని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని కోరుట్ల కొమరవ్వ కోహెడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్ఐ విచారణ చేసి భాను ప్రకాష్, అతని భార్య మాధవిలపై కేసు నమోదు చేశారు.

హాస్టల్‌ను తనిఖీ చేసిన అధికారులు

కొండపాక, సెప్టెంబరు 5: మండలంలోని దుద్దెడ సాంఘిక సంక్షేమ బాలుర హాస్టల్ గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలను అధికారులు గురువారం తనిఖీ చేశారు. త్రిసభ్య కమిటీ అధికారులు ఎంపీడీవో వెంకటేశ్వర్లు, తహసీల్దార్ దిలీప్ నాయక్, పీహెచ్‌సీ వైద్యుడు శ్రీధర్‌లు కలిసి వసతి గృహాలను పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వర్షాలు కురుస్తుండడంతో ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. పీఆర్ఏ తిరుపతిరెడ్డి తదితరులు ఉన్నారు.

సమన్వయంతో పనిచేద్దాం

● గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి

గజ్వేల్, సెప్టెంబరు 5: సమన్వయంతో పనిచేసి రైతులకు బాసటగా నిలుద్దామని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. గజ్వేల్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో వ్యవసాయ శాఖ ఏడీ బాబునాయక్, వ్యవసాయాధికారులు గుండు నాగరాజు, శైలజలు నూతనంగా ఏఎంసీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్‌లను గురువారం మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. అధికారులు, ప్రజాప్రతినిధులంతా సమన్వయంతో పనిచేసి రైతులకు అన్ని రకాలుగా ఆసరాగా నిలుద్దామని పిలుపునిచ్చారు. వారితో గజ్వేల్ ఏఎంసీ సెక్రెటరీ జాన్‌వెస్లీ, డైరెక్టర్లు ఉన్నారు.



వంటేరు నరేందర్‌రెడ్డిని శాలువాతో సత్కరిస్తున్న వ్యవసాయాధికారులు

డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలి

● డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి



గజ్వేల్ డీటీ భార్గవ్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

గజ్వేల్, సెప్టెంబరు 5: హాస్టల్, గురుకుల, కేజీబీవీ విద్యార్థులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం డిప్యూటీ తహసీల్దార్‌కు బార్గవ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. గజ్వేల్ డివిజన్‌లోని ప్రభుత్వ గురుకుల, కేజీబీవీ, సంక్షేమ తదితర హాస్టల్‌లలో ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీ తదితర పేద వర్గాలకు చెందిన విద్యార్థులు చదువుకుంటున్నారని, ఈ విద్యాలయాలలో కనీస సదుపాయాలు కరువై నరకయాతన అనుభవిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ పర్యవేక్షణ లేకపోవడంతో టీచర్లు, వార్డెన్, ప్రైవేట్ కాంట్రాక్టర్లలదే ఇష్టారాజ్యాంగా మారడంతో పిల్లలు తమ సమస్యల పరిష్కారానికి రోడ్డు ఎక్కాల్సిన దుస్థితి నెలకొన్నదన్నారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా డైట్ చార్జీలు పెంచకపోవడంతో పిల్లలు అర్ధాకలితో అలమటిస్తున్నారన్నారు. అయనవెంట డీబీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు, నాయకులు చంద్రం తదితరులున్నారు.

తోర్నాల అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం



పోషణ మాసం వేడుకల్లో ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

దూళిమిట్ట,సెప్టెంబరు 5: మండలంలోని తోర్నాల అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసంవేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుక మాట్లాడుతూ.. గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు పౌష్టికహారం తప్పనిసరిగా తీసుకోవాలని అవగాహన కల్పించారు. తీసుకునే ఆహారంలో ముఖ్యంగా ఆకుకూరలు, పప్పులు, గుడ్లు, పాలు, పండ్లు అన్ని ఉండేలా చూసుకోవాలన్నారు. బరువు తక్కువగా పుట్టిన పిల్లల పట్ల తల్లితండ్రులు చాలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్.ఎం పద్మజ, అంగన్‌వాడీ టీచర్ గౌతమి, ఆశా కార్యకర్త అరుణ, పిల్లల తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన ఇంటిని కూల్చివేసిన మున్సిపల్ అధికారులు

హుస్నాబాద్, సెప్టెంబరు 6: హుస్నాబాద్ పట్టణంలోని 20వ వార్డులో శిథిలావస్థకు చేరిన ఇంటిని మున్సిపల్ అధికారులు గురువారం కూల్చివేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు కూలిపోయే ప్రమాదం సంభవిస్తుందనే ఉద్దేశ్యంతో దీనిని తొలగించి బాధితులను పునరావాస కేంద్రానికి తరలించినట్లు చైర్‌పర్సన్ ఆకుల రజిత తెలిపారు. శిథిలావస్థకు చేరిన ఇళ్లను తొలగించడం జరుగుతుందని, దీనికి పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.



ఇంటిని కూల్చివేయిస్తున్న మున్సిపల్ అధికారులు

చేర్యాలలో నేలకూలిన ఇళ్ల పరిశీలన

చేర్యాల, సెప్టెంబరు 5: ఇటీవల కురిసిన వర్షాలకు చేర్యాల పట్టణంలోని పలు వార్డుల్లో నేలకూలిన ఇళ్లను గురువారం చేర్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి, కమిషనర్ నాగేందర్, కౌన్సిలర్లు ముస్త్యాల తార యాదగిరి, చెవిటి లింగం, కో-ఆప్షన్ సభ్యుడు ముస్త్యాల నాగేశ్వర్‌రావు, సీనియర్ అసిస్టెంట్ కృష్ణ తదితరులు పరిశీలించారు. ప్రభుత్వం తరఫున త్వరితగతిన సహాయం అందించేలా చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు.

కాంగ్రెస్‌తోనే ప్రజాసంక్షేమ పాలన

● మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం గౌడ్

చేర్యాల, సెప్టెంబరు 5: కాంగ్రెస్‌తో ప్రజాసంక్షేమ పాలన కొనసాగుతున్నదని మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ నేత నాగపురి రాజలింగంగౌడ్ పేర్కొన్నారు. చేర్యాల మండలం కమలాయపల్లి గ్రామానికి చెందిన అంజమ్మ, లెనిన్‌నగర్‌కు చెందిన శ్రీనివాస్, చేర్యాలకు చెందిన శివశంకర్, జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం కొన్నె గ్రామానికి చెందిన రాకేశ్ తదితరులకు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన చెక్కులను గురువారం మండలకేంద్రంలోని ఆయన నివాసంలో పంపిణీ చేశారు. ఆయనవెంట నాగపురి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.